# సాధన

రమాదేవిని చంద్రశేఖరం వివాహం చేసుకోవడానికి అంగీకరించడం చాలా పెద్ద సంచలనాన్ని కలిగించింది. ముందుగా శేఖరం తల్లి పిలిచి అడిగింది. "ఆ రమ అమ్మాయా ? అబ్బాయా ?" అని.

శేఖరం మాట్లాడలేదు.

"ఏమిరా మాట్లాడవు ? ఇంత భూప్రపంచంలో ఆ పిల్ల తప్ప మీ నాయనకూ, నీకూ మరెవరూ కనపడలేదా ? ఏమి చూచి చేసుకుంటున్నారు ?"

శేఖరం నవ్వాడు.

"నవ్వుతావేంరా ? సుఖంగా పోయే బ్రతుకును కష్టపెట్టుకోవాలని ఇదేం కోరిక నీకు ? తొందరపడకు నాయనా - బాగా ఆలోచించు."

"ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చానమ్మా !"

"మీ నాన్నకు తెలివిలేక ఆయిన సంబంధమని బలవంతం చేస్తున్నారు సరేకాని, మడమ బూట్లు వేసుకొని బాట్ చేత పట్టుకొని మోకాళ్ళ వరకూ గౌను వేసుకొని నర్సుపిల్ల వలె డ్యూటీ తప్పకుండా, క్లబ్బుకు పోయే ఆ పిల్ల అసలు నీతో కాపురం చేస్తుందా ? ఆయన సరే ! నీవైనా ఆలోచించకుండా శ్రీరాముని లా పితృవాక్య పరిపాలన చేయడమా ? ఇదేమి విపరీత బుద్ధి ?"

"అమ్మా, నేను అసలు తెలివైనవాడినా ? కాదా ? చెప్పు. నా వివేకం పైన నీకేమైనా అనుమానం ఉందా ?"

"తగలబడ్డట్టే ఉంది నీ తెలివి !"

కోపంతో వెళ్ళిపోయింది ఆమె. నిట్టూర్చాడు శేఖరం.

కాంటీన్‌లో మిత్రుడు రాఘవరావు కనపడి పలకరించాడు:

"శేఖరం ! మేమొక వార్త విన్నాము."

"ఔను - మీరు విన్న వార్త నిజమే."

కొంచెం ఆగి రాఘవరావు కాపీ చప్పరిస్తూ, "అయితే రమ వాళ్ళ నాన్న మూర్తిగారు ఎన్ని వేలిస్తున్నాడేమిటి నీకు ?" అన్నాడు.

"లేదు పైసా కట్నం తీసుకోవడంలేదు."

"మైగాడ్ ! కట్నం లేకుండా ..శేఖర్, నీవు మానవమాత్రుడివి కాదు. సాక్షాత్తు ......"

"సాక్షాత్తూ మానవుడివే. నూటికి నూరుపాళ్ళు మానవుడివే. కాబట్టే కావాలని చేసుకుంటున్నాను."

రాఘవరావు అన్నాడు. 'శేఖర్ ! నీవు చాలా పవిత్రమైన వ్యక్తివి. నీకూ మాకూ చాలా భేదం ఉంది. ఎవరో అమర్చిపెట్టిన మార్గంలో పయనించడం మేము చేస్తుంటే, పయనించవలసిన మార్గాన్ని కూడా నిర్మించుకోవడం నీవు చేస్తున్నావు."

x x x x

వివాహం జరిగి కొన్నాళ్ళు గడిచింది ఆనాడు ఆఫీసునుంచి చంద్రశేఖరం ఇంటికి బయలుదేరాడు. త్రోవలో ఒక అందమైన గులాబీపువ్వు కొన్నాడు. దానివెల ఎనిమిది పైసలు ఎనిమిది పైసలకోసం బేరగాడు దాన్ని అమ్మివేశాడు. అందరికి ఈ పువ్వుకన్నా ఆ ఎనిమిది పైసలు ఎక్కువ. కాని నిజానికి దీని విలవ ఎనిమిది పైసలేనా? అనుభవించగల యోగ్యతకల మనిషికి హిమాలయాల స్నిగ్ధత, కాశ్మీరపు సౌందర్యం, తాజ్‌మహల్ ప్రతిబింబం, ఊటీ చల్లదనం - అన్నీ ఈ చిన్ని పూవులోనే దర్శించలేడా? అనుభవించలేడా? కోట్ల రూపాయలతో లక్షల మైళ్ల తిరిగినా పొందలేని ఆనందం, ఈ గులాబీలోనే ఆస్వాదించవచ్చును కదా, అర్హత సిద్ధించినట్లయితే....

మానవుడు కూడా పువ్వులాంటివాడే ఒక రకంగా....

ఇల్లు చేరాడు శేఖరం. తన ప్రయోగంలో తొలి అధ్యాయం ఈనాడు ప్రారంభమైంది.

"రమా, అమ్మకు కొంచెం కులాసాగా లేదు. నీవే వంటచెయ్యి. పైగా నీ చేతి అమృతభోజనం తినాలని కోరికగా ఉంది. తినిపిస్తావా ఈ భక్తుడికి" అని అడిగి వెళ్ళాడు ఉదయం.

ఈ మాటలు ఆమె మనస్తత్వంమీద ఎలా పనిచేశాయో చూడాలి. లోనికి వెళ్ళేసరికల్లా అమ్మకు సుస్తీ కొంచెం ఎక్కువగానే ఉంది. ఆమెను పరామర్శించి మందు వగైరా తీసుకున్నదో లేదో కనుక్కొని, వెళ్ళి కాళ్ళు చేతులు కడుక్కొని వంట ఇంట్లోకి వెళ్ళాడు.

'రండి వడ్డించాను.' రమ పిలుపు.

ఆ పిలుపులో మార్దవం లేదు.

చిరునవ్వు చిందిస్తూ వెళ్ళి విస్తరిముందు కూర్చున్నాడు. రమ వడ్డించడం మొదలు పెట్టింది. పదార్థాల స్వరూపం చూచేసరికల్లానే శేఖరం కడుపు నిండి పోయింది. సగం సంకటి, సగం ననుబాయి అన్నం, మాడిపోయిన వంకాయ ముక్కలు, నాలికమీద పెట్టుకునే సరికల్లా కడుపులోని పేగులు తెగిపడేటట్లున్న ఉప్పుకషాయపు పచ్చడి, ఘనీభవించిన చారు....

శేఖర్ మాట్లాడకుండా తినడం మొదలు పెట్టాడు. కూర మొత్తం తిని వేశాడు. "రమా! ఎంత కమ్మగా ఉంది వంకాయ. 'వంకాయ వంటి కూరయు' అంటే ఏమిటో అనుకున్నాను. ఇదా అసలు విషయం! రమా ఇంక లేదా కూర ?-"

"లేదు!" ఆశ్చర్యంగా సమాధానం,

"లేదు రమా, నీ భాగం దాచుకున్న కూర ఉందేమో చూడు."

"ఉహూఁ. నేను హోటలు నుంచి కారియర్ తెప్పించాను." ఉన్నమాట అని వెంటనే చటుక్కున నాలిక కరుచుకుంది.

శేఖరం ఈలోపల పచ్చడి కలిపాడు. మాట్లాడకుండా తినేస్తున్నాడు. "అబ్బ! ఏమి పచ్చడి రమా ఇది ? ఎవరు నేర్పారు నీ కిలా చెయ్యడం ?"

అది హాస్యమో, అపహాస్యమో అర్థంకాలేదు రమకు. "మీకు వంటరాదనీ, ఎప్పుడూ బి ఎస్. సీ. ఎక్స్పరిమెంట్లతోనూ మీ మహిళామండలులు, క్లబ్బుల తోనూ కాలక్షేపం చేశావనీ, ఎన్నడూ పొయ్యిముందు కూర్చొని ఎరుగవనీ మా అమ్మ నిన్ను మన వివాహం కాకముందునుంచీ విమర్శిస్తూండేది. అబ్బే, అమెకేం తెలుసు." ఇంకొంచెం నెయ్యి పోసుకొని పచ్చిమిరపకాయ ఒకటి కొరుక్కుంటూ లొట్టలు వేస్తూ తింటున్నాడు పచ్చడి అన్నాన్ని శేఖరం

"రమా, మా అమ్మ జన్మలో ఇలాంటి పచ్చడి ఎప్పుడూ చేయలేదు ఆమెకు ఇలా చేతనేకాదు."

స్థాణువులా నిలబడిపోయింది రమ.

విమర్శ రాబోతున్నదనీ, 'నాకు వంట రాదని తెలిసి ఎందుకు చేయమన్నారు ? నేనేమి వంటకత్తెనా ?' అని అందామనీ ముందే సిద్ధం చేసికొని ఉంచుకున్న అస్త్రం ఇలా, ఇంత విచిత్రంగా వ్యర్థం అయిపోతుందని ఆమె కలలో కూడా ఊహించలేదు.

తృప్తిగా భోజనం ముగించి ప్రేమతో ఆమె కళ్ళల్లోకిచూస్తూ, "అమృతం రుచి చూపించావు నాకివ్వాళ' అని కృతజ్ఞతగా గులాబీని ఆమె జడలో పెట్టి బుజం నొక్కి వెళ్ళేసరికల్లా నిశ్చేష్టురాలైంది రమ. తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. శేఖర్ చెప్పిందంతా నిజమేనా ? అన్న అనుమానం బలంగా బయలుదేరింది. కూరా, పచ్చడి, అన్నం మొత్తం తినేశారే ! ఏమిటీ విచిత్రం ! వెళ్ళి అడుగున ఉన్న కొంచెం పచ్చడి నాలుకకు రాసుకొని చూచింది. ఆమెకిప్పుడు శేఖరం మాటలు విన్న శ్రవణేంద్రియం నిజం చెబుతున్నదో, కషాయం రుచి చూపించిన జిహ్వేంద్రియం సత్యం చెబుతున్నదో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

x x x x

కొన్నాళ్ళ తరవాత -

ఆ రోజు మధ్యాహ్నం శ్రీకాకుళం నుంచి వచ్చిన రమ వాళ్ళ బంధువులు వూరికి బయలుదేరారు. మళ్ళీ "ఇప్పుడేం తొందర" అని ఆపాలని ప్రయత్నించారు -

శేఖరమూ, వాళ్ళ అమ్మా, కాని ఈసారి నిజంగానే బయలుదేరినట్లున్నారు. వెనక రెండుసార్లు 'ఇప్పుడేం తొందర వెళ్ళవచ్చులే' అని అనీ అనక ముందే ఆగారు. ఈసారి మాత్రం పెట్టెలు వగైరా వరండాలో పెట్టి రిక్షావాడి కోసం మనిషిని పంపించారు.

శేఖరం తన శక్తివంచనలేకుండా వాళ్ళకు ఖరీదైన బట్టలు పెట్టాడు. శేఖరం తల్లి చేసిన పదార్థాలు కొన్ని తాటాకుల బుట్టనిండా పెట్టి ఇచ్చింది. రమా, శేఖరం ఇద్దరూ వెళ్ళి రైలు టికెట్టు కొని రైలెక్కించి వచ్చారు. ఇంటికి వచ్చేసరికల్లా శేఖరం నాన్న, ఆయనతోబాటు మరిద్దరు వ్యక్తులూ వచ్చారు. వాళ్ళు శేఖరం నాన్నగారి స్నేహితులు. ఈ ఊళ్ళో ఏదో వ్యాపార సంబంధమైన పనిమీద వచ్చారట!

"ఎలా వచ్చారు నాన్నా?" ప్రేమతో ప్రశ్నించాడు శేఖరం.

"డీలక్సు బస్సుమీద వచ్చాం బాబూ! ఆఁ, అమ్మ ఆరోగ్యం ఎలా ఉంది?"

"ఫరవాలేదు నాన్నా, కులాసాగానే ఉంది. అన్నయ్య వదినా వాళ్ల బాగున్నారా?"

"ఆఁ. కులాసాగానే ఉన్నార్రా. వాళ్ల రమకోసం ఒక జత బంగారు గాజులు పంపారు. పెళ్ళినాడు చేతిలో డబ్బులులేక ఏమీ చేయించలేదే మరదలికి అని వాడు చాలా రోజులుగా బాధపడుతున్నాడు."

"ఎందుకు నాన్నా, అన్నయ్య పిచ్చికాని ఇప్పుడేం రమకు తక్కువైనాయని, నగలు?"

"కోడల్ని చూపించండి బాబూ!" వ్యాపారస్థులు కోరారు.

శేఖరం లోనికివెళ్ళి "రమా, నిన్ను వాళ్లు పిలుస్తున్నారు" అన్నాడు.

'ఎందుకు?'

'చూడాలిట.'

'నన్ను చూచేదేమిటి?'

"ఏమిటి నీ అల్లరి ? అవతల పెద్దమనుషులు పిలుస్తుంటే...."

"ఏమిటండీ పెద్దమనులు ? నేనేం బజారు వస్తువునా, ప్రదర్శనలో నిలబడటానికి ?" రమ కంఠం పెద్దదవుతున్నది.

శేఖరం మారు మాట్లాడకుండా వెళ్ళి 'పనిలో ఉన్నది నాన్నా' అని చెప్పాడు.

'పోనీలెండి బాబూ, అలాగే రెండు రోజులు ఉంటాంకదా తొందరే ముంది ?' అన్నారు వ్యాపారస్థులు.

సాయంత్రం శేఖరం తల్లి అతిథుల కోసం ప్రత్యేకమయిన వంటకాలు చేసింది. కూరలోకి కరివేపాకు లేకపోయేసరికల్లా దాసీదాన్ని కేక వేసింది.

'లేదమ్మా, అది పాలకు వెళ్ళింది' అన్నాడు శేఖర్.

'అమ్మాయ్ రమా, పిన్నిగారినడిగి కరివేపాకు వాళ్ళ నౌకరుచేత పంప మని కబురు పెట్టు' అన్నది వంట ఇంట్లోనుండి.

అలంకరించుకొని ఎక్కడికో వెళుతున్నది రమ.

'వినపడ్డదా అమ్మమాట?' పుస్తకం పేజీలు తిప్పుతూ అన్నాడు శేఖర్.

'ఊఁ.'

'చెప్పుమరి.'

'నాకు తీరికలేదు మా మహిళామండలి మీటింగు ఉంది ఈవేళ.'

'పిన్నిగారితో మాటచెప్పి పోవటానికికూడా తీరికలేదా రమా?' నవ్వుతూ పశ్నించాడు శేఖర్.

'ఛీ! ఛీ! ఈ ఇంటికి వచ్చే అడ్డమైనవాళ్ళ చాకిరికీ, నేను నౌకరులా తిరగ వలసి వస్తున్నది...." విసుక్కుంటూ వెళ్ళి పిన్నిగారికి చెప్పి వెళ్ళిపోయింది.

ఆ వెళ్ళడం, రాత్రి పదిన్నర గంటలకు వచ్చింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. రమ హృదయంలో ఏదో భయం బయలు దేరింది. మెల్లగా లోనికి ప్రవేశించింది. సరిగ్గా తాను వెళ్ళబోయే ముందు

కూర్చున్న చోటనే శేఖరం కూర్చుని అదే పుస్తకాన్ని చదువుతూ ఉన్నాడు. రమ రాగానే తలె త్తి చూదాడు.

భర్త దగ్గరకు వచ్చి నిలబడింది.

'వెళ్లు రమ్మా, భోజనం చెయ్యి.'

'నాకు ఆకలిగా లేదు. అక్కడ డిన్నరులో భోంచేసి వచ్చాను.'

శేఖరం ఏమీ మాట్లాడలేదు.

రమ నిశ్శబ్దంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి గుడ్డలు మార్చుకున్నది.

ఉడుకులాం నీళ్ళతో ముఖం కడుక్కొని స్నో పౌడర్లతో తిరిగి అలంకరించుకొంది. తరవాత సన్నని వాయిల్ చీరె కట్టుకొని, తిరిగి రవికె మార్చి వేసింది.

సుతారంగా వచ్చి శేఖర్ పక్కన కూర్చున్నది.

శేఖర్ ఆమెను చూచాడు.

ఆమె శేఖర్‌ను చూచింది.

శేఖర్ సన్నగా నవ్వాడు.

రమ లాలనగా అన్నది "ఇంకా పడుకోలేదేం?"

"లేదు రమా, ఏదో చదువుతూ కూర్చున్నాను."

"రండి. ఇంకా పొద్దుపోతే మీ ఆరోగ్యం చెడుతుంది."

నవ్వుతూ అన్నాడు శేఖర్ "పిచ్చి రమా, పో. నువ్వు పడుకో."

రమ కొంచెం మధన పడింది. ఇంకెలా ఆయనను పిలవాలో అర్థం కాలేదు.

మృదువుగా టేబిల్‌లైట్ ఆర్పడానికి బటన్‌పై చూపుడువేలు ఉంచింది గోముగా చూస్తూ రమ. కొంటెగా నవ్వుతూ శేఖర్ ఆమె వేలు మెల్లిగా పక్కకు

తొలిగించాడు. తెచ్చి పెట్టుకున్న ప్రణయకోపంతో 'ఫోంధి' అన్నట్టు ముఖం పెట్టింది.

సమాధానంగా శేఖరం ఒక నవ్వు నవ్వి తిరిగి పుస్తకంలో పడ్డాడు. కొంచెం ఆగి "వారెక్కడ పడుకున్నారు?" అన్నది రమ.

"ఏవరు వారు?" అన్నాడు శేఖర్ పుస్తకంలోకే చూస్తూ.

"అదే, మామగార్లూ, వారి మిత్రులూ...."

"ఓహో! నీచేత చాకిరీ చేయించుకుంటున్న ఆ అర్థమైనవాళ్లు" అన్నాడు నవ్వుతూ.

రమ ఉలిక్కిపడింది.

"ఔను, రమా, వాళ్ళు వెళ్ళిపోయారు. నేనే 'ఏదో' చెప్పి పంపించేశాను. భయం లేదులే. రా ఇలా దగ్గరికి....." ప్రేమతోనే ఆమె దగ్గరికి జరిగాడు.

ఉమ గుండెలలో ఎవరో గునపాలతో పొడిచినట్లయింది.

x x x x

మరి కొన్నినాళ్ళు గడిచాయి.

ఆరోజు రాత్రి పియానోమీద ఏదో విదేశీయ గీతం ఆలాపిస్తున్నది రమ.

వాళ్ళ నాన్న కొని ఇచ్చిన పియానో అది.

అప్పుడే ప్రవేశించాడు శేఖరం. కాసేపు దూరంగానే నిలబడి విన్నాడు. అకస్మాత్తుగా చప్పట్లు కొట్టాడు.

తటాలున వెనుదిరిగి చూచింది రమ.

"భేష్ రమా! భేష్! నీవు ఎంత బాగా వాయించావో తెలుసా?"

అది ప్రశంసో విమర్శో అర్థంకాలేదు రమకు.

దగ్గరికి వచ్చి ఆమె రెండు భుజాలపైన రెండు మోచేతుల్నూ ఆన్చి "రమా" అన్నాడు ప్రేమగా.

చేతులు పక్కకునెట్టి కొంచెం గర్వంగానూ నిర్లక్ష్యంగానూ "ఏమిటి?" అన్నది.

శేఖరం అలా ఆమెవైపు చూస్తూనే ఉన్నాడు.

ఆమె శేఖరం సమాధానానికై కాసేపు ఎదురుచూచి జవాబు రాకపోయే సరికల్లా తల పైకెత్తి చూచింది.

శేఖరం అలా రెప్ప ఆర్పకుండా తనవైపే చూస్తున్నాడు.

"ఏమిటలా చూస్తారు?"

జవాబు శూన్యం.

గద్దిస్తూ అడిగింది: "ఏమిటలా దయ్యాన్ని చూసినట్టు చూస్తారు?"

"కాదు రమా, దేవతను చూచినట్లు చూస్తున్నాను రమా! నీవెంత అంద మైనదానివి? నీవెంత బాగా పాడగలవు?"

"అయితే.... ఏమంటారిప్పుడు?"

"ఏమీలేదు, నాదొక్క చిన్న కోరిక, మన్నిస్తావా?"

"ఏమిటి?" అనుమానంగా అడిగింది.

"నీవెందుకు ప్రపంచ సుందరీమణుల అందాల పోటీలోనూ ఖండాంతర వాద్యసంగీత స్పర్ధలోనూ పాల్గొనకూడదు?"

చప్రున తాచుపామువలె లేచింది రమ. ఆమె కన్నులు కోపంచేత విచ లిస్తున్నాయి. "మీ ఉద్దేశం ఏమిటి ఈ మాట అనడంలో...."

శేఖరం నవ్వి అన్నాడు "వేరే ఉద్దేశమేముంది రమా! నా భార్య అంద గత్తె, సంగీత విద్వాంసురాలు అన్న పేరు పొందడంకన్న నేనిక సాధించ వలసిందేముంటుంది నా జన్మలో నీవల్ల."

"అంటే నన్ను అంగట్లో నిలబెట్టి అంగాంగాలన్నీ అడుగులు, అంగు ళాలూ కొలిచే ఆ సౌందర్యపు పోటీలో పాల్గొనజేయడం కోసమేనా మీరు నన్ను పెళ్ళిచేసుకున్నది?"

"నేనెందుకు చేసుకున్నానో తరవాత ఆలోచిద్దాం కాని, నీవెందుకంత ఈ మాటకు కోపగించుకోవాలో మటుకు నా కర్థంకావడంలేదు.... ఏం రమా? రోజూ నీవు క్లబ్బుకు వెళ్ళి చేసేదేమిటి? పోటీలో టేపుచేత దేహంలోని భాగాలను కొలిచి, వెండి, బంగారపు బహుమతులు నిర్ణయిస్తే ఇక్కడ ప్రేక్షకులు తమ చూపుల తూపులతో నీ ప్రత్యంగాన్నీ కొలిచి 'వహ్వా ఎంత అందమైన ఆట ఆడుతున్నది!' అన్న ప్రశంస అనే బహుమతిని ఇస్తూనే ఉన్నారు కదా.... మరి?"

రమ ముఖం వివర్ణమైంది. మేఘం ఉరిమి ఉరిమి వర్షించినట్లు రమ ముఖం క్రమంగా ఎర్రదనంనుండి నల్లదనంలోకి దిగి, ఒక్కసారి భోరుమని ఏడ్పు ప్రారంభించింది.

శేఖర్ మృదువుగా దగ్గరికి వచ్చి చేతిగుడ్డతో కన్నీళ్ళు తుడుస్తూ "అబ్బే, పిచ్చిపిల్లలా ఏడిస్తే ఎలా? ఊరుకో! చూచినవారు ఏమనుకుంటారు?"

"ఏమనుకుంటారా? రమ భర్త ఒక రాక్షసుడనుకుంటారు."

శేఖరం నవ్వాడు.

ఆ నవ్వు ఆమెను శూలాలతో పొడిచినట్లు బాధించింది.

"దైవసాక్షిగా చెబుతున్నాను. రేపటినుండి నేను క్లబ్బుకు పోనేపోను." రెండు చేతులతోనూ ముఖం కప్పుకుని తన గదిలోకి పరుగెత్తుకుంటూ వెళ్ళి పోయింది.

చాలా సేపటివరకు గదిలోనుండి అలా ఎక్కిళ్ళు వినవస్తూనే ఉన్నాయి.

కాని శేఖరం లేచి వెళ్ళి ఓదార్చలేదు.

x x x

ఇంకొంత కాలం తరవాత.

ఆరోజు రమ, శేఖరం ఇద్దరూ కొత్తగా ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిన బంధువుల ఇంటికి వెళ్ళారు. వాళ్ళు చాలా ప్రేమతో ఆదరించారు. అప్పటి కప్పుడు ఉప్మా, బజ్జీలు చేసి, కాఫీ పెట్టి ఇచ్చారు. అంతా కలసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ తింటున్నారు. ఇంతలో పక్కవాటాలో ఏదో దుఃఖ కంఠ స్వరం వినబడింది. చూస్తూండగానే "అమ్మో అమ్మో" అన్న ఏడుపు. పెద్ద దెబ్బలు వినబడ్డాయి. శేఖరం స్తంభించిపోయాడు. స్నేహితుడు వాసు చెప్పాడు.

"శేఖరం ఇదొక న్యూసెన్సుగా తయారైందోయ్ ఇక్కడ. ఆయన తాగి వచ్చి ఆమెను అలా కొడుతుంటాడు. ఈ పోరు భరించలేక ఇల్లు మారుద్దామని చూస్తే ఈ వూళ్ళో ఇల్లు కొత్తది దొరకడం ఎంత కష్టమో నీకు తెలియనిది కాదుకదా!'

"ఆమె చేసిన నేరమేమిటి ?' రమ ప్రశ్నింది.

"బాధించడానికి నేరం కూడా కావాలా వదినా ?" వాసు నవ్వి అన్నాడు.

రమ చివాలున లేచి తలుపు తోసుకొని ఇవతలకు వచ్చింది.

ఆమె ఏమి చేస్తున్నదో తెలియక తక్కిన వారంతా అయోమయంగా చూస్తూ ఉన్నారు. రెండు మూడడుగులలో రమ లోనికి వెళ్ళింది.

"ఏమయ్యా, ఏమిటీ అమానుషం! ఆడదాన్ని అలా గొడ్డును బాదినట్లు బాదడానికి నీకు చేతులెలా వచ్చాయి! ఎంత భార్య అయితే మటుకు అలా కొట్టే అధికారం ఎవరిచ్చారు నీకు ?' ధిక్కరించి పలికింది.

ఆ తాగుబోతు ఆ హఠాత్సంఘటనకు కొంచెం ఆశ్చర్యపోయి అచేతనుడై నిలబడ్డాడు.

రమే అన్నది! "ఇకమీద ఒక్క దెబ్బ వేశావో నీ మర్యాద దక్కదు!"

"వోరమ్మా నీవు - మా ఇంటికి వచ్చి నన్ను ఏదిరిస్తున్నావ్ ?"

కొంచెం కోపంగా అన్నాడతడు.

రమ రెట్టించిన కోపంతో "అలా చూస్తూ నిలబడతావేమమ్మా, చావగొడుతుంటే! నీవు మనిషివా ? రాయివా ? - రక్తం కారేట్లు కొడుతుంటే తిరగబడకుండా మొద్దులా నిలబడతావేం ?' అని రెచ్చగొట్టింది ఆమెను రమ.

వెంటనే ఆ ఇంటి ఆవిడ "చూడు పిల్లా! నీవెవతవో నాకు తెలియదు కాని నా మొగుడు నన్ను కొడుతుంటే నీకేమొచ్చింది రోగం ? నా మొగుడు నన్ను చంపుతాడు, పాతేస్తాడు. అది వాడి ఇష్టం. నా ఇష్టం. నీకేంపోయింది?" అంది దాదాపు తిట్లు తిట్టే ధోరణిలో.

రమ ఒక్కసారి అఘాతం తిన్నది.

పరిస్థితి చెడుతుందేమోనని కలుగజేసుకోవడానికై వాసు ముందుకు ఒకడుగు వేశాడు. వెంటనే చిరునవ్వు నవ్వుతూ శేఖరం చేతిని అడ్డుపెట్టి ఆపివేశాడు.

రమ అప్రతిభురాలయింది. మారు మాట్లాడలేక పోయింది.

చుట్టూ చూసింది.

అంతా తన్నే చూస్తున్నారు.

తన్ను బోనులో ముద్దాయిలా నిలబెట్టినట్లు భావించింది.

మరొక నిమిషం అలాగే ఉంటే రమ ఇక ఏడుస్తుందని గమనించాడు శేఖరం వాసుకూ అతని భార్యకూ "వస్తామని" దరహాసం ఒలకరిస్తూ చెప్పి వీధిలోకి వచ్చి రిక్షా మాట్లాడి రమతోబాటు ఎక్కాడు. రిక్షా కదిలింది.

కొంచెంసేపు నిశ్శబ్దం. అనంతరం రమ ముఖంలోకి చూచాడు శేఖరం. పరాజయం పొందిన రమ రెండు కళ్ళలోనూ రెండు నీలాలు నిలిచాయి.

"రమా !"

"ఏమండీ ! నేను చేసింది తప్పేనంటారా ?"

'ఈ ప్రశ్నకు ఇలా జవాబు చెప్పడం కష్టం రమా ! మన దృష్టితో చూచి నప్పుడు మనం చేసిందే సమంజసమనిపిస్తుంది, కాని ఆ ఇల్లాలి దృష్టిలో ఆమె మాటలూ సమంజసాలే.'

కోపంతో అన్నది : 'మూడురాలు ! తనకు మిత్రులెవరో, శత్రువులెవరో కూడా తెలుసుకోలేకపోయింది.'

శేఖరం నవ్వాడు.

ఈ నవ్వు ఆమె కోపాన్ని ఇనుమడింపజేసింది. శేఖరం కనక ఏదైనా మాట అంటే దాన్ని తక్షణం ఖండించి పెద్ద ఎత్తున పోట్లాట పెట్టుకోవాలని సిద్ధపడి కూర్చున్నది.

కొన్ని క్షణాలు ఆగి శేఖరం అన్నాడు : 'చూడు రమా! ఆ స్త్రీ విషయంలో సానుభూతి చూపడం కన్నా, జోక్యం కల్గించుకునే అధికారంలేదు మనకు. ఇహ లోకంలో జీవనాధారమతను. పరలోకానికి సారథి, వారధి అతను. అందువల్ల అతను ఏమి చేసినా ఆమె భరించక తప్పదు. పైగా సంఘం నుండి అతనికి అన్ని విధాలైన సహాయ సానుభూతులూ లభిస్తాయి.

'ఒకటి మాత్రం నాకు నిజమని తోస్తున్నది. ఈ జాతిలో స్త్రీలకన్నీళ్ళకు అంతమనేది లేనట్లున్నది. రాముని రాజనీతి విన్యాసానికి నిండు చూలాలు సీత బలి అయింది. హరిశ్చంద్రుని ధర్మ పరిపాలన కొరకు వేదననను భవించింది చంద్రమతి. భర్త మహాశక్తిమంతుడు కాకపోవడం వల్ల పద్మిని భస్మరాశిగా మారిపోతే, భర్త మహాశక్తిమంతుడైనందువల్ల పాంచాలి దశాబ్దాల పర్యంతం అడవులలో గడ్డిరొట్టెలు తింటూ జీవించింది. కారణాలు ఏవైనా కార్యం మాత్రం ఒకటే! స్త్రీల అంతులేని కన్నీటి స్రవంతి. అయితే ఒక అపూర్వమైన విశేష మేమంటే భర్తచేసే ప్రతి పనివల్ల భార్య ఆనందాన్నే అనుభవించింది కాని ఆక్రందించలేదు. భర్త చేతిలో కసాయివానికి అమ్మబడటమే తమకు మోక్షమని చంద్రమతి భావించింది. చంద్రమతిమీద నీకూ నాకూ సానుభూతి ఉంది, కాని బాధ్యత లేదు. చంద్రమతిమీద నీకన్నా నాకన్నా ఒక కోటిరెట్లు ప్రేమగల హరిశ్చంద్రుడికి ఈ ప్రేమతో బాటు బాధ్యతకూడా ఉంది. కాబట్టే తన బాధ్యత తాను నిర్వహించాడు. ఆ కర్తవ్య పాలనలో ఇరువురూ సంతోషాన్నే అనుభవించారు."

"అయితే నాటి బాల్యవివాహాలూ, నేటి వరకట్నాలూ.... స్త్రీలను ఇలా వంటఇంటి కుందేళ్ళగా బలి పశువులుగా మార్చడం మీరు సమర్థిస్తున్నారా?"

'లేదు. నేను జన్మ జన్మలకీ సమర్థించలేను. అయితే ఇక్కడ సమస్య మారింది. ఇప్పటివరకూ మనం మాట్లాడుకున్నది భార్యాభర్తల సంబంధం, ఇప్పుడు నువ్వు లేవదీసిన సమస్య సాంఘిక దురాచారాలకు సంబంధించింది. ఇది స్త్రీకి, పురుషునికి మధ్య సమస్య కాదు; వ్యష్టికీ, సమష్టికీ మధ్య సమస్య. ఈ భేదంమీద నీవింకా బాగా ఆలోచించు.'

రమ మాట్లాడలేదు.

శేఖరం కూడా కొంచెంసేపు ఆగాడు.

ఇల్లు వచ్చింది.

రిక్షా దిగుతూ ఇంగ్లీషులో అన్నాడు: 'ఈ దేశపు స్త్రీ సర్వతోముఖాభివృద్ధికోసం ఆదర్శ సింహాసనంపై ఆమెను ఆరాధ్య దేవతగా ప్రతిష్ఠాపించడం కోసం మనం ఏమైనా చెయ్యవలసి ఉంటుంది. ఎంత త్యాగానికైనా సిద్ధపడవలసి ఉంటుంది'.

రమ కళ్ళలో ఒక కొత్త వెలుగు కనిపించింది.

x x x x

కాలచక్రం పరిభ్రమిస్తున్నది.

రమ పుట్టింటికి వెళ్ళింది. సరదాగా తమ్ముడితో ఆడుకుంటూ గడిపింది. తమ్ముడు కృష్ణ పదవతరగతి చదువుతున్నాడు. ఒట్టి అల్లరి రకం. జేబులో ఒక చిన్ని దువ్వెన పెట్టుకొని నిమిషానికి మూడుసార్లు తల దువ్వుకుంటూ ఉంటాడు. ఎర్రగా అందంగా ఉంటాడు. అచ్చం రమ పోలికే. రెండు రోజులైనాక ఒకనాడు కృష్ణ అన్నాడు: 'అక్కా! నీవు బావను ఏడిపిస్తున్నావట కదా!'

రమ కదిలిపోతూ అన్నది: 'ఏమిటి నువ్వంటున్నది?'

'నేననడం కాదక్కా, వదినావాళ్లు అంటుంటారు అప్పుడప్పుడూ'

'ఊం....' అంది సాలోచనగా.

'అప్పుడు అమ్మ కలుగజేసుకొని నిన్ను సమర్థిస్తూ ఉంటుంది.'

'వదినా!' పొలికేక వేసింది రమ, ముందు వెనుకలు ఆలోచించకుండా మరుక్షణంలోనే.

వంటగదిలోనుండి వదిన వచ్చింది.

'వదినా! నన్ను గూర్చి ఏమనుకుంటున్నారు నా పరోక్షంలో?' నిలదీసి అడిగింది.

అకస్మాత్తుగా ఇలా అగ్నిపర్వతం ఎందుకు బద్దలైందో తెలియక అయోమయావస్థలో పడిపోయింది శాంతమ్మ.

'ఏమిటి రమా, నీవనేది?'

'నేననేది కాదు శాంతమ్మగారూ. మీరనేది ఏమిటి? నేను నా మొగుణ్ణి ఏడిపిస్తున్నానని అన్నావటగదా?. ఎందుకన్నావు?'

శాంతమ్మ నవ్వింది. 'ఓ అదా! దానికేనా ఇంతలావున కేకలేశావు. నేను హడిలిపోయాను సుమా. ఏదో నవ్వుకుంటూ అన్నాము నలుగురం కూర్చొని. అవి సరదామాటలు రమా'

'సరదా ఏమిటి సరదా? నా కాపురాన్ని గూర్చి మీకు సరదా ఏమిటి? నేనెప్పుడైనా మీ కాపురాన్ని గూర్చి సరదామాటలు అంటున్నానా?'

శాంతమ్మ నవ్వుతూ అన్నది: 'అయితే ఇరవైనాలుగు గంటలూ ఇంటి పట్టున ఉండి సంసారజీవితం సాగించే నా కాపురమూ, క్లబ్బులనీ, మహిళా మండలికనీ తిరిగే నీ కాపురమూ ఒకటేనంటావా?'

ఈ మాట శాంతమ్మ కొంచెం అమాయికంగానే అన్నది. కాని దీనిలోని ప్రతి అక్షరమూ వికృతంగా కరాళనృత్యం చేస్తూ రమాదేవిమీద తిరగబడ్డాయి.

క్రోధంతో రమ అన్నది: 'హుఁ- నడమంత్రపు సిరిపట్టి నాగుపాములా విషం కక్కుతున్నావు. నా అన్న ఇంటికి వచ్చి ఆయన చెల్లెల్నే అపహాస్యం చేస్తున్నావు!'

ఈ కేకలకు ఇంట్లోని నలుగురూ పోగైనారు. మూర్తిగారు ఇంట్లో లేరు. ఉద్యోగంమీద టూర్ వెళ్ళారు మిగిలినవాళ్ళంతా వచ్చారు. రమ నాగినివలె బుసకొట్టింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో, సన్ననైన ఆమె నడుము లేదీగెవలె అల్లాడిపోతున్నది. ఎడమచేతి చూపుడు వేలుతో కుడివైపు ముంగురులను పైకి నెట్టి అన్నది గాద్గదికంగా.

"చూడమ్మా, ఈమె ఏమంటున్నదో! తన కాపురం లోకోత్తరమైన ఆదర్శప్రాయమైందిట ! ఈ దంపతులు సీతారాములట ! మాదేమో గాలికి పోయే కాపురమట !"

"ఆ మాటలు నే ననిదే" బాధగా అన్నది శాంతమ్మ.

"ఏమిటి అనని ది ? నీవన్న మాటలకు అర్థం ఏమిటి ? - అసలు నాగూర్చి నా భర్తను గూర్చి మాట్లాడుకోవలసిన అవసరం నీకేమొచ్చింది ?"

'ఊరుకోవే రమా, ఏమిటలా అరుస్తున్నావ్ ?' రమ తల్లి మందలించింది.

"ఎలా వూరుకుంటానమ్మా, ఈమె మాటలకు కడుపు మండిపోతుంటే?"

శాంత కొంచెం కోపంగా అన్నది : 'నేనేమీ అంత కడుపు మండిపోయే మాటలు అనలేదు? ఉన్నమాట అన్నాను."

"ఏమిటి వదినా, ఉన్నమాట ?' సూదులవంటి చూపులతో శాంతను పొడుస్తూ అన్నది.

"నేనెప్పుడైనా ఉన్న మాటలు కదా అని నీ గూర్చి ఏమయినా అన్నానా ? నీ తండ్రి ఒకప్పుడు డబ్బులులేక ముష్టి ఎత్తివాడని అన్నానా? గర్భదరిద్రంతో చీలికలు, పీలికలు కట్టుకొని తిరిగే బుడబుక్కలసంఘ కుటుంబంనుండి నువ్వు వచ్చి, మా అన్నయ్య సోమ్ముతో పొగరుబట్టావని ఎప్పుడైనా ఒక్కసారి అన్నానా ? ఉన్న మాట........"

శాంతలో ఉద్రేకం కలిగింది. 'నోరు మూసుకో రమా ! పిన్నా పెద్దా తారతమ్యం లేకుండా మాట్లాడుతున్నావ్. పెళ్ళయినాకన్నా అత్తగారికి చేదోడు వాదోడుగా ఉంటావనుకున్నాము కాని రంగేలీ సినిమా బొమ్మలా వీధులు పట్టుకొని తిరుగుతుంటావని అనుకోలేదు మేము. నీ మొగుడు అమాయకుడు కాబట్టి సరిపోయింది. లేకపోతేనా...."

'ఆఁ ! లేకపోతే -" రమ వణికిపోతూ అన్నది క్రోధంతో.

'లేకపోతే నిలువునా నిన్ను నరికి ఉప్పుపాతరలో పెట్టేవాడు,'

శాంత మాట ముగియకముందే శాంత చెంపపై ఫెడీమని దెబ్బకొట్టాడు ఆమె భర్త.

"బుద్ధిలేనిదానా, ఎందుకలా నోరు పారేసుకుంటావ్ ? రమ సంగతి మనకు తెలిసి ఉండి దాన్ని ఆడిపోసుకుంటే ఏం లాభం ? అదొక మూర్ఖురాలు-చెప్పే సార్థకంలేని మనిషి. అట్లాంటిదానితో నీకు వాదనేమిటి ? ఇలాంటి అసభ్య సన్నివేశం మరొకసారి ఇంట్లో సృష్టించావంటే నిన్ను నరికేస్తాను...."

చకచకా నడిచి వెళ్ళిపోయాడు.

రమ కళ్ళ వెంట నీటిజాలు ప్రవహించింది. అన్నయ్య అన్న ప్రతిమాటా తన హృదయాన్ని వజ్రంతో కుమ్మినట్లనిపించింది. ఆయన కొట్టిన దెబ్బ శాంతపైన కాదు. రమ మనస్సుపైన - రమ మమతపైన.

ఆ రాత్రి రమ చంద్రశేఖరం దగ్గరికి వెళ్ళిపోయింది,

x x x

కొన్ని నెలల అనంతరం -

మహిళామండలి వార్షికోత్సవాలకై చందాలు వసూలు చేయడంకోసం బయలుదేరిన నలుగురు ప్రముఖులలోనూ రమ ఒకతె. రమ ఒత్తిడి వల్ల గత్యం తరం లేక వ్రతభంగం చేసి బయలుదేరింది రమ. నలుగురూ ఒక ప్రముఖ ధనవంతుని ఇంటికి వెళ్ళారు. కార్యదర్శిని సీమాబాయి తమ్ము నలుగురినీ గుప్త గారికి పరిచయం చేసింది. గుప్త రమను చూచి సకిలించాడు.

"ఈమె... ...."

"ఔనండీ ! మా కన్వీనర్ శ్రీమతి రమాశేఖర్."

"హా....హా....హి...." భావగర్భితంగా సకిలించాడు. రమకు అసహ్యం వేసింది.

కార్యదర్శిని నవ్వుతూ అన్నది : 'మీలాంటి దాతలు భారీ విరాళాలు చేస్తేనే ఈ రకం సంస్థలు వర్ధిల్లుతాయి."

'ఔనౌను. ఆ బాధ్యత మాకూ ఉన్నది. మా కర్తవ్యం మేము నిర్వ హిస్తాము. రమాశేఖరంగారూ, సాయంత్రం ఒకసారి రాగలరా ? డబ్బు సిద్ధం చేసి ఉంచుతాను...."

రమ ఏదో మాట్లాడబోయింది. వెంటనే సీమాబాయి 'చిత్తం వెయ్యి న్నూటపదహార్లయినా ...' అన్నది చేతులు నలుపుతూ.

గుప్త సగర్వంగా తల ఊపాడు. 'వస్తారు కదా సాయంత్రం. బాంక్‌కు పంపి కాష్ చేయిస్తాను చెక్కు అప్పటికి' అంటూ లేచాడు.

నలుగురూ బయటకు వచ్చారు. సీమాబాయి చాలా సంతృప్తి పడింది. వేయిన్నూట పదహార్లు ఇతడు ఇస్తాడని ఆమె కలలో కూడా అనుకోలేదు. రమ అన్నది, "నేను డబ్బు తేవడానికి వెళ్ళను. ఏమిటి అతని వాలకం అలా ఉంది ?' అని

సీమాబాయి నిర్లక్ష్యంగా నవ్వి "ఫరవాలేదులే రమా. అతనంతేలే పోనీ, అయినా వాడెట్లాంటివాడయితే మనకెందుకు ? మనకు కావలసింది డబ్బు. వెళ్ళు" అన్నది.

రమ క్రోధంతో "అయితే సుదేష్ణకూ నీకూ తేడా ఏమిటి సీమాబాయి గారూ !' ఆక్రోశంతో అని, ఇంటి ముఖం పట్టింది.

ఆ రోజంతా ఆమె ముఖం కందగడ్డగానే ఉంది. మనసంతా అసహ్యంతో నిండుకొనిపోయింది.

x x x x

ఆనాడు సాయంత్రం తన స్నేహితురాలు సీత పుట్టిన రోజు పండుగకు రమ్మంటే సింగారించుకొని వెళ్ళింది రమ తనతోబాటు చదువుకున్న స్నేహితు లెందరో కనపడటంతో అనుకోకుండానే పొద్దుపోయింది. అందరూ రమ అదృ ష్టాన్ని అభినందించారు. చంద్రశేఖరాన్ని పొగడటం మొదలు పెట్టారు. ఆ పొగడ్తలతో రమ నిజంగా చాలా గర్వించింది తన భర్తకు పరాయి స్త్రీలు అలా ప్రశంసిస్తూంటే అదోలా కూడా అనిపించింది తనకు.

బాగా పొద్దుపోయి ఇంటికి వచ్చింది ఆటోమీద. గదిలో తల్లీ కొడుకూ మాట్లాడుకుంటున్నారు.

"కావచ్చు శేఖరం, కాని నీ తర్కం నాకు నచ్చలేదు."

"తర్కం కాదమ్మా! వాస్తవమిది. నేనిందులో వితండవాదం చేస్తున్న దేముంది? ఎవరెవరి మన స్తత్వాలెలాంటివో చెప్పాను, వాటికి అనుగుణంగా ఎలా నడుచుకోవాలో వివరించాను. అయినా ఇప్పుడు రమ కూడని చోటికేమీ పోలేదు. స్నేహితురాలి పుట్టినరోజు పండగని వెళ్ళింది. ఇంత పొద్దుపోతుందని కనక తెలిసిఉంటే వెంట మనిషిని పంపించేవాణ్ణి. లేదా నేనే అలా వెళ్ళి తీసుకొని వచ్చేవాణ్ణి."

"ఈ పుట్టినరోజు పండుగ సమస్యకాదు బాబూ,నేనంటున్నది. అసలు ఒక స్త్రీ నడుచుకోవలిసిన తీరు గూర్చి మాట్లాడుతున్నాను. మరో నాలుగు రోజులు ఉండి నీ కడుపున ఒక కాయకాస్తే చూసి కన్ను మూద్దామనుకుంటున్న దాన్ని, రమకు ఇక్కడ ఏమిటి బాధ? అత్తపోరు లేదు. ఆడబిడ్డపోరు అసలేలేదు. మామగారు చూద్దామా, నీ అన్నయ్యవద్ద ఉంటున్నాడు.

ఇక ప్రతిదానికీ రుసరుసలూ, సణుగుడులూ, సంసారం తనకు పట్టనట్లు తామరాకుమీద నీటి బొట్టులా ఉండటాలూ. దీనికి కారణమేమిటో నా కర్థం కాలేదు. ఒక రోజుకు కాకపోతే మరొక రోజుకైనా ఆ పిల్ల బుద్ధి కుదుటపడి భర్తమీద ప్రేమానురాగాలతో వ్యవహరిస్తే నా కంతకన్నా కావలసిందేమిటి? ఈమె ఏమి మహా నాయకురాలా? సమాజాన్నంతా తాను ఉద్ధరిస్తుందా? దేశాన్ని పరిపాలిస్తుందా? ఎందుకు వచ్చిన తిరుగుళ్లు? ఇంట్లో పిల్లలకు తిండి పెట్టకుండా ఆలనా పాలనా చూడకుండా అనాథ శరణాలయాలకు చందాలు వసూలు చేస్తారట, ఇంటిని అనాథ శరణాలయాలుగా మార్చి, ఎందుకీ సభలూ, సమావేశాలూ ఈమెకు?

"అమ్మా! ఇప్పుడు నీ వన్న మాటలలో కొన్ని పొరపాట్లు కూడా ఉన్నాయి రమకు నాపైన ప్రేమానురాగాలు లేవన్నావే అది పూర్తిగా అబద్ధం. ఆమెకు నేనంటే ఎంత ఇదో అది నీకు నేను చెప్పడం నాకు సాధ్యంకాని విషయం పోతే క్లబ్బులు, మండలులు, చందాలు, ఉపన్యాసాలు వగైరాలన్నీ ఆమె వదిలి చాలారోజులైంది. ఇదివరకు నిరంతరం పుట్టింటిని ఇంద్రలోకం

గానూ అత్తవారిల్లు ఏదో నరకకూపంగానూ వర్ణిస్తూ ఉండేది. ఇప్పుడా రకం సంభాషణ అసలు రావడంలేదు.... ఆమెలోని పరివర్తనము నేను ప్రతిరోజూ గాపు గిస్తున్నాను. నీకు బహుశా తెలియకపోవచ్చు ఆ విషయం.

"నిజానికి రమ తప్పు అసలు ఏముంది కనక? ఈనాటి కథలూనవలలూ, సినిమాలూ, పత్రికలూ, టి వి లూ, మహిళా సమాజాలు,విద్రోహుల ఉద్యమాలు స్త్రీని ఒక మిథ్యాలోకంలో విడిచిపెడుతున్నాయి. వికృతమైన అధునిక విద్యా విధానపు ఝంఝులో స్త్రీ దిక్కు దరీ లేకుండా కొట్టుకొని పోతున్నది. ఆమెకు జీవితపు సత్యాలూ, మానవత్వపు విలువలూ, కుటుంబ జీవనంలోని మాధుర్యమూ తెలిసేసరికల్లా పుణ్యకాలం కాస్తా అయిపోయి గతజల సేతుబంధన మౌతున్నది. అలాంటి లక్షల స్త్రీలలో ఒక సామాన్య స్త్రీ రమ.

"అమ్మా, రమ హృదయం చాలా సున్నితమైనది. స్వభావం చాలా ఉద్రేకపూరితమైంది. ప్రతి చిన్న మాటా ఆమెమీద చాలా తీవ్రంగా ప్రతిబింబిస్తుంది. ఆమెను కొందరు అర్థంచేసుకోలేక గడసరి అనీ, గర్విష్ఠి అనీ భావిస్తారు కాని, అది పూర్తిగా అసత్యమని నా స్వానుభవం తేల్చి చెప్పింది. ఆమె ఒక శుద్ధమైన స్ఫటికం. మనం ప్రతిఫలించే రంగులే ఆమెలో కనపడతాయి. ఆమె ఒక మంచుముద్ద. సరియైన సూర్యకిరణం పడితే ఆమె కరిగి కరిగి సెలయేరై ప్రవహిస్తుంది. లేనప్పుడు అ ఘనీభవించిన మంచు ముద్దే. మనకు అస్పృశ్యయై, అసహనీయమై గోచరిస్తుంది. నేను నిన్ను కోరేది ఒక్కటే! రమను తెలిసికానీ, తెలియకపోకకానీ ఏమీ అనకు ఆమె ఏమీ ముదినాపసాని కనకనా, అనుభవం గడించి ఆరితేరడానికి? చాలా పసిదమ్మా రమ. ఇంకా ప్రపంచపు స్వరూపం సరిగ్గా తెలియని ముగ్ధ ఆమె. ఆమె సరదాలేమిటో ఆమెను అనుభవించనీ. ఆమెను తమాషాకు కూడా ఏమీ అనకు నువ్వు. ఆమె తీరున ఆమెను సంచరించనియ్యి. లేకుంటే నేను భరించలేనమ్మా...."

శేఖరం తల్లి పెద్దగా నవ్వింది. "బాగానే ఉంది ప్రేమ" అని మళ్ళీ నవ్వింది.

తలుపుదగ్గర ఉండి అన్నీ విన్న రమ తల పైకెత్తి చూచింది. గోడపై భోళాశంకరుని ఫోటో, వెంకటేశ్వరుని ఫోటో, చంద్రశేఖరం ఫోటోలు కని

పించాయి. కృతజ్ఞతతో రెండు కన్నీటి బిందువులు పుడమితల్లిపై రాల్చింది. నిశ్శబ్దంగా తన గదిలోకి వెళ్ళిపోయింది రమ.

రమ రావడమూ, తలుపు దగ్గర నిలబడటమూ,రమ తమ మాటలు వినడమూ, నిశ్శబ్దంగా తన గదికి వెళ్ళిపోవడమూ అన్నీ ఆమె అతి సూక్ష్మమైన పదధ్వని వల్లనే చంద్రశేఖరం గమనించి, తృప్తిగా నవ్వుతున్నాడు.

కొన్ని వారాల అనంతరం-

ఆ సాయంత్రం రమ అన్ని బీరువాలను సర్దుకున్నది. ఒక బీరువాలో బ్యాట్ మింటన్‌లో పురుషులతో గెలిచినందుకుగాను తనకు టీం కెప్టెన్‌గా కాలేజీ వాళ్ళిచ్చిన అందమైన కంచుబొమ్మను తీసింది. ఎందువల్లనో అది తనవద్దనే ఉండిపోయింది. దానిని చూసేసరికికల్లా ఆమెకేదో ఒక విచిత్ర లోకం గోచరించింది. మోకాళ్ళవరకూ గౌను వేసుకొని వక్షస్థలంపై సవాలుచేసే బిగిసిన జాకెట్టుతో చూపరులకు ఆకర్షణీయంగా ఉండటమే పరమ ధ్యేయంగా కల్గిన సీతాకోక చిలుకల వంటి రెండు జడలతో చలాకీగా ఎగిరిన పిల్ల -

ఎవరు? తనేనా? తనకేనా ఈ బొమ్మ వచ్చింది?

చెమటతో ముఖాన ఉన్న కుంకుమ వెడల్పయింది. నేత చీరె చెంగును గట్టిగా నడుముకు బిగించి మునివ్రేళ్ళపై నిలబడి ఈ బొమ్మను చూసి బీరువా పైన వెనకకు నెట్టాలని ప్రయత్నం చేస్తున్నది, ఇంతలోనే నౌకరు పరిగెత్తుకుంటూ వచ్చి ఆదుర్దాగా "అమ్మగారూ, బాబుగారు కారుకింద పడ్డారండీ! హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు" అన్నాడు.

రమకు ఈ మాటలు వినపడటమయితే జరిగింది కాని, ఆ తరవాత ప్రపంచం కనపడటం మటుకు జరగలేదు. చేతిలోని చిన్ని కాంస్య విగ్రహం చేజారి నేలపైబడి ముక్కలైంది. నిలుచున్న చోటనే రమ అలా కుప్పకూలిపోయింది. మరొక పది నిమిషాలలో పక్కవీధిలోని డాక్టరమ్మ వచ్చి రమకొక ఇంజక్షనిచ్చి భయం లేదని చెప్పి వెళ్ళిపోయింది.

ఇంకొక గంటసేపటికే ఎడమ చేతికి చిన్న కట్టుకట్టి హాస్పిటల్‌లో ఉండవలసిన అవసరం బొత్తిగా లేదని చెప్పి డాక్టర్లు వెంటనే శేఖరాన్ని డిస్చార్జ్ చేశారు.

"చేతిని నీళ్ళల్లో తడపనీయకండి. పప్పు పదార్థాలు తినకండి" అని జాగ్రత్త చెప్పి పంపాడు డాక్టరు.

శేఖరం ఇంటికి వచ్చేసరికల్లా బాగా చీకటి పడింది. చంద్రోదయం జరిగింది కూడా. ఒక గదిలో తల్లి కన్నీళ్ళతో కూర్చొని ఉన్నది. శేఖరాన్ని చూడగానే ఓపికనంతా కూడదీసుకొని లేచి నిలబడ్డది. శేఖరం నవ్వుతూ "ఏమిటమ్మా ! ఎందుకీ దిగులు ? పరవాలేదని ఫోను చేశాను కదా !" అన్నాడు.

"కాబట్టే మీ నాన్నకు ట్రంకాల్ చేయలేదుబాబూ ! నేను ఆసుపత్రికి రాలేదు పిల్లను వదిలి" అన్నది.

శేఖరం అయోమయంగా చూస్తున్నాడు.

"నీకు ఫోనుమీద చెప్పడమెందుకని ఊరుకున్నాము. రమ ఈ వార్త వినగానే సొమ్మసిల్లి పడిపోయింది. డాక్టరమ్మ వచ్చి ఇంజక్షను...."

'రమా -' వినిపించుకోకుండానే పరిగెత్తాడు లోనికి శేఖరం.

రమ మంచంమీద పడుకొని ఉంది చాలా నీరసంగా ఉంది. శేఖరాన్ని చూడగానే లేవబోయింది.

మంచంమీద కూర్చొని ఆమెను లేవకుండా వారించాడు. రమ వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

'ఏమిటిది పసిపిల్లలాగా- ఛీ ! ఊరుకో . ఏమయింది నాకు ? ఏమీ కాలేదు. పొరపాటున కారు కొంచెం గీసుకొనిపోవడంతో అజాగ్రత్త వల్ల కింద పడిపోయాను. జీవితంలో ప్రతి నిమిషమూ జాగ్రత్త అవసరమే రమా ! ఏమంటావు ?" నవ్వుతూ అన్నాడు.

మెడలోని ఒంటిపేట గొలుసుతోబాటు పలకల సల్లపూసల మధ్య ఉన్న మంగళసూత్రాలను ఒక చేతితో హృదయానికి హత్తుకొని రెండవ చేతితో లాలనగా శేఖరాన్ని స్పృశిస్తూ అన్నది,

"ఏమో, మగమహారాజులు. మీరేమైనా కబుర్లుచెపుతారు... కాని...." మళ్ళీ రెండు వెచ్చని కన్నీటిబొట్లు రాల్చింది రమ.

"నేను మహారాజునైతే నీవు మహారాణివి. నేనొకవేళ ఈ లోకానికి అధినాథుణ్ణి అయినా నా హృదయానికి నీవు అధి........"

"చాల్లెండి అత్తగారు వస్తున్నారు. వూరుకోండి మీ సరసం."

వెండి కంచంలో పాల అన్నం కలిపి చక్కెరవేసి తెచ్చి టేబిల్ పై పెట్టింది శేఖరం తల్లి.

"నీరసం వస్తుందేమో పాల అన్నం పెట్టమని చెప్పిందిరా డాక్టరమ్మ" అన్నది తల్లి.

"మీరు వెళ్ళండి అత్తగారూ, నేను తినగలను" అన్నది విధేయతతో, మరుక్షణంలో అత్తగారే తనకు అన్నం తినిపించాలనే ప్రయత్నం చేయగలదని ఊహించి.

ఆమె మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

శేఖరం నవ్వాడు.

"ఎందుకు నవ్వుతారు?" అన్నది రమ.

"నీవు అమ్మను ఎందుకు పంపావో నాకు తెలుసు."

'ఎందుకు?' అన్నది ప్రేమతో చూస్తూ.

'ఇందుకు' అని క్షీరాన్నాన్ని ఆమె నోటికందించాడు శేఖరం.

'పోండి. మరీను నాకు సిగ్గు వేస్తున్నది' అని ముసిముసి నవ్వులు నవ్వింది రమ.

'తిను సాధనా, అన్నం తిను' అన్నాడు శేఖరం.

'నా పేరు సాధన కాదు; రమ' అన్నది. ఆమె భర్త ఇచ్చే ప్రసాదాన్ని అందుకుంటూ.

'కాదు. నీవు సాధనవు - నా సాధనవు' అన్నాడు చంద్రశేఖరం నవ్వుతూ.

చంద్రుడు బాగా పైకి వచ్చాడు.

బీరువాదగ్గర పగిలి పడిపోయిన కంచుబొమ్మ ముక్కలు మాత్రం అలాగే కదలిక లేకుండా ఉండి శాశ్వతంగా నిద్రపోయాయి.